సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 23 । ఆగస్టు । 2024



కేజీహెచ్ మార్చురీ వద్ద బాధితుల ఆర్తనాదాలు



అంతులేని ఆక్రందన

వారిద్దరూ ప్రేమించుకున్నారు. పెద్దలను ఒప్పించి ఈ ఏడాదే పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం ఓ బిడ్డకు జన్మనివ్వబోతోన్న ఆ దంపతులు భవిష్యత్తును ఊహించుకుంటూ పొందిన ఆనందానికి అంతేలేదు. వారి ఆనందాన్ని చూసి మృత్యువుకూ కన్నుకుట్టింది. ఫార్మా ప్రమాదం రూపంలో భర్తను కాటేసింది. తమ బిడ్డ భూమిపైకి రాకముందే భర్త(చిరంజీవి)ను పోగొట్టుకున్న ఆ ఇల్లాలి (లీలాదేవి) వేదన వర్ణనాతీతం. కేజీహెచ్ మార్చురీ వద్ద భర్త నుంచి పొందిన ప్రేమను తలచుకుంటూ, అతను చేసిన బాసలు గుర్తు చేసుకుంటూ విలపిస్తుంటే.. యముడు మనసు మార్చుకునైనా ఆమె భర్త ప్రాణాల్ని తిరిగిస్తే బాగుండు కదా.. అని కోరుకోని వారు లేరంటే అతిశయోక్తి కాదు.





కన్నీటి సుడులు

సాక్షి, విశాఖపట్నం/మహరాణిపేట : ఫార్మా ప్రమాదపు మృతుల బంధువుల రోదనలతో విశాఖ కేజీహెచ్, అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి పరిసరాలు మిన్నంటాయి. ఎటు చూసినా తమ ఆత్మీయుల్ని కోల్పోయిన కుటుంబ సభ్యుల వేదనలే. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా ఫార్మా ప్రమాదంలో మృత్యు ఒడికి చేరిన తమవారిని కడసారి చూసుకునేందుకు గంటల తరబడి నోచుకోక నరకయాతన అనుభవించారు. తమవారి మృతదేహాలు ఎక్కడున్నాయో.. ఎవరిని సంప్రదించాలో తెలీక.. శవాగారం వద్ద.. జాగారమే చేశారు.బుధవారం రాత్రి 10 గంటల నుంచి గురువారం రాత్రి 10 గంటల వరకూ మార్చురీల వద్ద పడిగాపులు కాశారు. వారికి కనీస ఏర్పాట్లు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం అణువణువునా కనిపించింది. భర్తను కోల్పోయిన గర్భిణీ ఏడుస్తూ, నీరసించిపోయినా కేజీహెచ్ సిబ్బంది కన్నెత్తి చూడలేదు.



ఫార్మా కంపెనీ వద్ద పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



మృతుల బంధువులను ఓదారుస్తున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నేతలు

న్యూస్‌రీల్

నేడు అనకాపల్లికి మాజీ సీఎం జగన్ రాక



విశాఖ సిటీ : వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం అనకాపల్లికి రానున్నారు. ఉదయం 9 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి విమానంలో బయలుదేరి 10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 11.20కు అనకాపల్లిలో ఉన్న ఉషా ప్రైమ్ హాస్పిటల్‌కు వెళతారు. అక్కడ ఎసైన్షియా కంపెనీ ప్రమాద బాధితులు, వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. తిరిగి మధ్యాహ్నం 12.30కు అక్కడి నుంచి బయలుదేరి 1.30కి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఇక్కడి నుంచి బెంగళూరు పయనమవుతారు.

27న సింహగిరిపై శ్రీకృష్ణాష్టమి



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ఈ నెల 27న శ్రీకృష్ణాష్టమిని వైభవంగా నిర్వహిస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాస మూర్తి తెలిపారు. ఆ రోజు రాత్రి శ్రీకృష్ణ జననోద్ధారణ పూజలు, బాలకృష్ణుడికి బేడా తిరువీధి తదితర విశేష కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 28న సాయంత్రం 4.30 గంటల నుంచి ఆలయ రాజగోపురం వద్ద ఉట్ల సంబరం ఉంటుందని, భక్తులు పాల్గొనాలని కోరారు. 27వ తేదీ ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు(రాజభోగం సమయంలో) దర్శనాలు లభిస్తాయని, సాయంత్రం 6 గంటల నుంచి దర్శనాలకు అనుమతి లేదని ఈవో వెల్లడించారు.

30న సింహగిరిపై సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

సింహాచలం : ఈనెల 30న శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని సింహగిరిపై పెద్ద ఎత్తున సామూహిక వరలక్ష్మీవ్రతాలు నిర్వహించనున్నట్లు ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వ్రతాల్లో పాల్గొనే మహిళలకు పూజాసామగ్రి, ప్రతిమ, రవిక, ప్రసాదం దేవస్థానం ఉచితంగా అందజేస్తుందన్నారు. కొండ దిగువ నుంచి కొండపైకి, కొండపై నుంచి దిగువకి దేవస్థానం బస్సుల్లో ఉచితంగా ప్రయాణం కల్పించనున్నట్లు తెలిపారు. వ్రతాలు అనంతరం స్వామి దర్శనం ఉచితంగా అందిస్తామన్నారు.

రేపు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయీ సంఘాల సమావేశాలు ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో డి.సత్యనారాయణ తెలిపారు. చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఉదయం10 గంటల నుంచి రెండు, ఐదవ, 11 గంటల నుంచి నాలుగు, మూడవ, మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆరు, ఏడు, 1వ స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయన్నారు. సభ్యులు, సంబంధిత జిల్లా అధికారులందరూ ఈ సమావేశాలకు హాజరు కావాలన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీల్లో దిగడం నిషిద్ధం

అల్లిపురం: జీవీఎంసీ పరిధిలోని భూగర్భ మురుగునీటి కాలువల్లోకి ఎవరూ దిగకూడదని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ స్పష్టం చేశారు. భూగర్భ మురుగునీటి కాలువలను మానవీయంగా శుభ్రపరచే పద్ధతిని నిషేధించినట్లు గురువారం ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. జీవీఎంసీకి చెందిన యంత్రాల సాయంతో, అధికారిక అనుమతితో మాత్రమే ఈ కాలువలను శుభ్రపరచాలని ఆయన సూచించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీల్లో దిగి ఎవరైనా పరిశుభ్రత పనులు చేస్తున్నట్లు గమనిస్తే.. వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1800 4250 0009కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

వందేభారత్‌కు ఏలూరులో ప్రయోగాత్మక హాల్ట్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఏలూరు స్టేషన్‌లో ప్రయోగాత్మక హాల్ట్ కల్పిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విశాఖ-సికింద్రాబాద్(20708) వందేభారత్‌కు ఈ నెల 25 నుంచి, సికింద్రాబాద్-విశాఖ(20707) వందేభారత్‌కు ఈ నెల 26 నుంచి ఏలూరులో హాల్ట్ కల్పించారు. విశాఖలో మధ్యాహ్నం 2.35 గంటలకు బయలుదేరే వందేభారత్ సాయంత్రం 5.54 గంటలకు ఏలూరు చేరుకుని, అక్కడ నుంచి 5.55 గంటలకు బయలుదేరుతుంది. సికింద్రాబాద్‌లో ఉదయం 5.05 గంటలకు బయలుదేరే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 9.49 గంటలకు ఏలూరు చేరుకుని, అక్కడ నుంచి 9.50 గంటలకు బయలుదేరుతుంది.

తీరని వేదన.. ఏదీ సాంత్వన

- ఘటనా స్థలంలో హృదయ విదారక దృశ్యాలు
- ఇప్పటికీ అలాగే శరీర అవశేషాలు
- పూర్తి కాని శిథిలాల తొలగింపు
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- ఆస్పత్రుల్లో క్షతగాత్రుల అరణ్యరోదన
- అనకాపల్లి, విశాఖ ఆస్పత్రుల్లో చికిత్స
- తల్లడిల్లుతున్న కుటుంబ సభ్యులు



మృతుడి బంధువుల ఆర్తనాదాలు

సాక్షి, అనకాపల్లి: ఘోర ప్రమాదానికి వేదికగా నిలిచిన అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని ఎసైన్షియా అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రాంగణంలో.. హృదయ విదారక దృశ్యాలెన్నో గుండెను మెలిపెడుతున్నాయి. రియాక్టర్ పేలి 24 గంటలైనా ఘటనా స్థలంలో శరీర అవశేషాలు చెట్టు కొమ్మకు వేలాడుతూనే ఉన్నాయి. ఎన్డీఆర్‌ఎఫ్ బృందాల సభ్యులు రెండో రోజు గురువారం సాయంత్రం వరకు క్రేన్‌లతో భవన శిథిలాలు తొలగిస్తూనే ఉన్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో గల మెడికవర్, ఉషా ప్రైమ్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను.. వారి పరిస్థితిని చూసి కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. ఇప్పటికీ ఫ్యాక్టరీ పరిసరాల్లో రసాయనాల వాసన పోలేదు. కంపెనీ చుట్టూ దట్టమైన పొగలతో నల్లని మబ్బులు కమ్మినట్లుగా ఉంది.

కంపెనీ ముందు పడిగాపులు

మృతుల బంధువులు గురువారం వేకువజాము నుంచే ఎసైన్షియా కంపెనీ వద్దకు చేరుకున్నారు. సీఎం చంద్రబాబు వచ్చేవరకూ వారు వేచి ఉన్నారు. వర్షంలో కూడా తడిసే అక్కడ ఆర్తనాదాలతో పడిగాపులు కాశారు. మృతి చెందినట్లు తమకు అధికారులు గానీ, కంపెనీ యాజమాన్యం గానీ సమాచారం ఇవ్వలేదని.. కనీసం స్థానిక ప్రజాప్రతినిధులు కూడా కల్పించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరామర్శించేందుకు వచ్చిన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తాను అండగా ఉంటానని చెప్పినా తమకు నమ్మకం లేదని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబును కలిసేందుకు ప్రయత్నించినా.. ఆయన వచ్చిన కంపెనీ వెనక మార్గం వైపు వీరిని అనుమతించలేదు. దీంతో కంపెనీ ముందే సాయంత్రం వరకూ పడిగాపులు కాశారు.

ప్రమాద ఘటనపై సీఎం సమీక్ష

ఎసైన్షియా ఫార్మా కంపెనీ ప్రొడక్షన్ బ్లాక్‌లో బుధవారం జరిగిన ప్రమాదాన్ని పరిశీలించేందుకు జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం మధ్యాహ్నం 2.34 గంటలకు హెలికాప్టర్ ద్వారా అచ్యుతాపురం సెజ్‌కు చేరుకున్నారు. ప్రమాదం జరిగిన బ్లాకులను సందర్శించారు. అనకాపల్లి కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా పరిశ్రమల అధికారులతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఘటన జరిగిన క్రమాన్ని మ్యాప్ ద్వారా ముఖ్యమంత్రికి కలెక్టర్, ఎసైన్షియా ఫార్మా కంపెనీ ప్రతినిధులు వివరించారు. అనంతరం హోం మంత్రి అనిత, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ రమేష్, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయకుమార్, బండారు సత్యనారాయణమూర్తి, కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ దీపిక పాటిల్, విశాఖపట్నం సెజ్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎం.శ్రీనివాస రావు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మీడియా సమావేశం అనంతరం సాయంత్రం 5.25 గంటలకు ఫార్మా కంపెనీ నుంచి హెలికాప్టర్‌లో ఎయిర్ పోర్టుకు బయలుదేరారు.

మహా ప్రస్థానం వాహనాల్లో తరలింపు

పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కేజీహెచ్ నుంచి మహా ప్రస్థానం వాహనాల్లో కాకినాడ, రాజమండ్రి, విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లోని వారి స్వగ్రామాలకు తరలించినట్లు 108 జోనల్ మేనేజర్ గంగరాజు తెలిపారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.శివానంద్ పర్యవేక్షించారు.

డ్యూటీకి వెళ్లిన పావుగంటలోనే..



పూడి మోహన్‌ను నేను పెంచుకుంటున్నాను. వాడి వయసు 20 ఏళ్లు. వాళ్ల అన్నయ్య నాని ఎసైన్షియా కంపెనీలోనే ఏడాదిగా పనిచేస్తున్నాడు. అతని రిఫరెన్స్‌తో రెండు నెలల కిందటే మోహన్ జాబ్‌లో చేరాడు. నిన్న మొదటి షిఫ్ట్‌లో అన్నయ్య నాని డ్యూటీ అయిపోగా.. తమ్ముడికి వెళ్లొస్తానని చెప్పి వచ్చేశాడు. రెండో షిఫ్ట్‌కు వెళ్లిన మోహన్ పావుగంటలోనే రియాక్టర్ పేలి చనిపోయాడు. అధికారులు కనీస సమాచారం ఇవ్వలేదు.

– దేవి, మృతుడు పూడి మోహన్ పిన్ని

పరిహారం ప్రకటించడం కాదు.. అందించాలి

- ఎల్‌జీ పాలిమర్స్ ఘటనలో ఇచ్చినట్లు అందరికీ అందించాలి
- ఘటనాస్థలిని పరిశీలించిన ఎమ్మెల్సీ బొత్స, మాజీ మంత్రులు

సాక్షి, అనకాపల్లి: ఎసైన్షియా ఫార్మా ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు, క్షతగాత్రులకు పరిహారం ప్రకటించడమే కాదు, వెంటనే అందించాలని వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం ప్రమాదం జరిగిన స్థలాన్ని మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11 గంటలకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనకాపల్లి చేరుకుని, ఉషా ప్రైమ్‌లో క్షతగాత్రులను పరామర్శిస్తారని తెలిపారు. తమ నాయకుడి ఆదేశాల మేరకే క్షతగాత్రుల వద్దకు వెళ్లి, వారిని పరామర్శించి, మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పినట్లు పేర్కొన్నారు. ఫార్మా కంపెనీలో ఇంత పెద్ద ప్రమాదం జరిగితే స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రి స్పందించిన తీరు దారుణమని బొత్స ఆక్షేపించారు. వారికి తీరిక వచ్చినప్పుడు ఇలా వచ్చి అలా వెళ్లిపోయారని విమర్శించారు.


భర్త లేడన్న నిజం ఉదయం వరకూ చెప్పలేదు..



పరిశ్రమ గేటు వద్ద యల్లబిల్లి లోవమ్మ

ఎసైన్షియా ఫార్మా ప్రమాదంలో యల్లబిల్లి చిన్నారావు(34) మరణించిన విషయం ఆయన భార్య లోవమ్మకు బంధువులు, చుట్టుపక్కల వారు గురువారం ఉదయం వరకూ చెప్పలేకపోయారు. లోవమ్మ తీవ్రమైన మూర్ఛరోగంతో బాధపడుతోంది. ఆమెకు నెలకు రూ.5 వేల వరకు మందులకు ఖర్చవుతోంది. చిన్నారావు, లోవమ్మ దంపతులకు ఏడేళ్లలోపు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పోషణ నిమిత్తం పరిశ్రమలో పెయింటర్‌గా పనిచేస్తున్న చిన్నారావు ప్రమాదంలో ప్రాణాలు విడిచాడు. ఈ విషయం అతడి భార్యకు ఎలా చెప్పాలో తెలియక బంధువులు, ఇరుగుపొరుగు వారు చాలా ఇబ్బంది పడ్డారు. ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో కోలుకుంటున్నట్టు చెప్పి ఆమెను ఓదార్చారు. చివరకు గురువారం ఉదయం ఆమె కు విషయం చెప్పారు. పరిశ్రమ ముఖద్వారం వద్ద దీనంగా ఉన్న ఆమెను పలువురు మీడియా ప్రతినిధులు అడిగినా, తన భర్త ఏమయ్యాడో పూర్తిగా చెప్పలేని దయనీయ స్థితిలో ఉండటం పలువురి హృదయాలను ద్రవింపజేసింది.

కేజీహెచ్ మార్చురీ వద్ద హైడ్రామా



ఫార్మా మృతుల బంధువులతో కేజీహెచ్ మార్చురీ పరిసరాలు

మహారాణిపేట: ఫార్మా ఘటనకు సంబంధించి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహణలో గురువారం మధ్యాహ్నం వరకు హైడ్రామా నెలకొంది. బుధవారం రాత్రి 12 మృతదేహాలను కేజీహెచ్‌కు తీసుకురావడం తెలిసిందే. గురువారం ఉదయం విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ మార్చురీ వద్దకు వచ్చి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం అందజేస్తామన్నారు. అయితే ప్రకటించిన నష్టపరిహారానికి అనకాపల్లి కలెక్టర్ లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వాలని మృతుల బంధువులు ఆయనకు స్పష్టం చేశారు. ఎలాంటి నష్ట పరిహారం ప్రకటించకుండా, కంపెనీ వాళ్లు రాకుండా ఎలా పంచనామాకు సంతకాలు పెడతామని నిరాకరించారు. కంపెనీ ఉద్యోగి చనిపోతే ఎలాంటి సమాచారం లేదని, యాజమాన్యం ఇప్పటికీ రాలేదని, తాము ఎవరిని నమ్మాలని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యలమంచిలి ఎమ్మెల్యే, అనకాపల్లి ఎంపీ రాకపోవడంపై బాధితులు మండిపడ్డారు. రెవెన్యూ, పోలీసులు, కేజీహెచ్ సిబ్బంది మృతుల బంధువులకు ఎంతగానో నచ్చజెప్పేందుకు యత్నించినప్పటికీ.. ఫలితం లేకపోయింది. అంతా తాము చూసుకుంటామని బతిమలాడినా వారు ఒప్పుకోలేదు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెవెన్యూ, పోలీసులు అన్ని రకాలుగా ప్రయత్నించారు. ఇంతలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు మార్చురీ వద్దకు వచ్చి.. ఇంకా శవపంచనామా చేయకపోవడంపై ప్రశ్నించడంతో కదలిక వచ్చింది. అప్పటికి రెండు పంచనామాలు పూర్తి చేసి, మూడో పంచనామాకు శ్రీకారం చుట్టారు. ఛిన్నా భిన్నమైన మృతదేహాలకు సంబంధించిన బంధువులను రప్పించి.. రాత్రికి ప్రక్రియ పూర్తి చేశారు.

ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబాల ఆందోళన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబాలు, సీపీఎం, సిటు నాయకులు

అనకాపల్లి : ఎసైన్షియా ఫార్మా కంపెనీ ప్రమాదంలో చనిపోయిన ఐదుగురి మృతదేహాలను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు, సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఎన్టీఆర్ ఆస్పత్రి పోస్టుమార్టం రూమ్ వద్ద ప్రభుత్వానికి, ఫార్మా కంపెనీ యాజమాన్యానికి వ్యతిరేకంగా బాధిత కుటుంబాల వారు ధర్నా చేపట్టారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని, సంఘటన జరిగి 24 గంటలు దాటినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి నేటికీ స్పష్టమైన ప్రకటన రాకపోవడం అన్యాయమని అన్నారు. కాలం చెల్లిన ఫార్మా కంపెనీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబానికి రూ.కోటి చెల్లించాలని, నష్టపరిహారం చెల్లింపుపై లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్చురీ నుంచి ఎన్టీఆర్ ఆస్పత్రి బయటకు వెళుతున్న సమయంలో ఆస్పత్రి గేటు వద్ద పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ తమ సిబ్బందితో అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం డివిజన్ మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ మాట్లాడుతూ మృతుల కుటుంబానికి కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పాలన్నారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. మార్చురీ వద్ద ప్రభుత్వ అధికారులు లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మోదీ మృతుడి కుటుంబానికి రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇంత ఘోరం జరిగినప్పటికీ అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎంపీ సీఎం రమేష్ వచ్చి మృతుల కుటుంబాలను పరామర్శించకపోవడం దారుణమన్నారు. ఆందోళనలో సీపీఎం, సీఐటీయూ నాయకులు, ఆర్.శంకరరావు, రాజు, అప్పారావు, మృతుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'స్థాయి'కి మించి మంతనాలు

- బదిలీపై వెళుతున్న అధికారితో టీడీపీ నేత రహస్య సమావేశం
- జీవీఎంసీలో కాంట్రాక్టర్లు, వారి నుంచి తీసుకోవాల్సిన కమీషన్లపై ఆరా



విశాఖ సిటీ: టీడీపీలో ఓ కీలక నేత బరితెగించాడు. 'స్థాయి'కి మించి ప్రవర్తిస్తున్నాడు. జీవీఎంసీలో కాంట్రాక్టర్లను ఎలా, ఎంత వరకు కొల్లగొట్టాలని ఆలోచన చేస్తున్నాడు. దీని కోసం జీవీఎంసీ నుంచి బదిలీపై వెళుతున్న అధికారితో రహస్య మంతనాలు జరిపాడు. ఇప్పుడు జీవీఎంసీలో ఇదే హాట్ టాపిక్‌గా మారింది. జీవీఎంసీ స్థాయీ సంఘ ఎన్నికల్లో కూటమి పార్టీలు కుట్రలు చేసి పది స్థానాలను దక్కించుకున్నాయి. ఈ స్థాయీ సంఘాన్ని అడ్డుపెట్టుకొని రూ.కోట్లు సంపాదించేందుకు ఎవరి వ్యూహాల్లో వారు నిమగ్నమై ఉన్నారు. అయితే ఈ స్టాండింగ్ కమిటీకి సంబంధం లేని టీడీపీలో ఓ కీలక నేత.. వీరికి చెక్ పెట్టి మొత్తం నొక్కేయడానికి పథక రచన చేస్తున్నాడు.

వెన్నుపోటు పార్టీకే వెన్నుపోటు

వెన్నుపోటు అంటే ఠక్కున గుర్తొచ్చేది చంద్రబాబు. కుట్రలు, కుతంత్రాలు, అబద్ధాలతో అధికారంలోకి వచ్చే తెలుగుదేశం.. ప్రత్యర్థి పార్టీ నేతలకు ప్రలోభాల ఎర చూపి లాక్కున్న చరిత్ర అందరికీ తెలిసిందే. అదే విధంగా జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో సైతం వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను తమవైపునకు తిప్పుకొని అన్ని స్థానాలను దక్కించుకుంది. జీవీఎంసీ పరిధిలో అత్యధిక పనులు, కాంట్రాక్టులను స్థాయీ సంఘ సమావేశంలో ఆమోదించి వాటి ద్వారా కమీషన్లు కొట్టేయాలని కొండంత ఆశతో ఉన్నారు. ఇంతలో ఆ పార్టీ కీలక నేత ఆ స్థాయీ సంఘ సభ్యులకు వెన్నుపోటుపొడిచేందుకు ప్లాన్ సిద్ధం చేసుకుంటున్నాడు. స్టాండింగ్ కమిటీతో సంబంధం లేకపోయినప్పటికీ.. తన పలుకుబడిని ఉపయోగించి కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు నొక్కేయాలని భావిస్తున్నాడు.

అధికారితో రహస్య మంతనాలు

దీనిపై ఒక అధికారితో రహస్య మంతనాలు జరిపినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ఇప్పటివరకు స్థాయీ సంఘంపైన, జీవీఎంసీ కాంట్రాక్టర్ల విషయంపై పెద్దగా అవగాహన లేని ఈ కీలక నేత ప్రస్తుతం వారిపై పట్టుకోసం ప్రయత్నిస్తున్నాడు. ఇందులో భాగంగా జీవీఎంసీ నుంచి బదిలీపై వెళుతున్న ఒక అధికారిని పిలిపించుకొని రహస్యంగా సమావేశమయ్యాడు. జీవీఎంసీ పరిధిలో ఎంత మంది కాంట్రాక్టులు ఉన్నారు? ప్రస్తుతం ఎవరు ఎటువంటి కాంట్రాక్టులు చేస్తున్నారు? ఎవరి నుంచి ఎంత వరకు కమీషన్ల రూపంలో తీసుకోవచ్చు అన్న విషయాలపై సదరు అధికారి ద్వారా ఆరా తీసినట్లు తెలిసింది. స్టాండింగ్ కమిటీలో ఆమోదించే పనులలో సైతం తన పలుకుబడి ఉపయోగించి ఎంత వరకు కమీషన్లు తీసుకోవాలన్న విషయాన్ని అధికారితో చర్చించినట్లు తెలిసింది. స్థాయీ సంఘ సభ్యుడు కాకపోయినప్పటికీ అటు నుంచి కూడా భారీగా సంపాదించాలని గట్టి నిర్ణయంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఒకరిద్దరు స్టాండింగ్ కమిటీ సభ్యులు సదరు నేతపై గుర్రుగా ఉన్నట్లు అతడి సన్నిహితుల మధ్య చర్చ జరుగుతోంది.

ఒక్క డిపో నుంచే ఇసుక సరఫరా

- కలెక్టర్ హరేందిర ప్రసాద్ వెల్లడి
- ఇసుక నిల్వలు లేక భీమిలి డిపో క్లోజ్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో సీపీ బాగ్చి

మహారాణిపేట: సులభతర రీతిలో ఇసుక సరఫరా చేసేందుకు పటిష్ట చర్యలు చేపతున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్నామని, రవాణా, ప్రాసెసింగ్ చార్జీలు మాత్రమే వసూలు చేస్తున్నట్లు చెప్పారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చితో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భీమిలిలో ఇసుక నిల్వలు లేకపోవడంతో.. ఒక్క అగనంపూడి డిపో నుంచి మాత్రమే ఇసుక సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. అగనంపూడి డిపోలో ప్రస్తుతం 61 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. అక్కడ నుంచి రోజూ 100 వాహనాల ద్వారా ఇసుకను ప్రజలు తీసుకెళ్తున్నారని వివరించారు. రవాణా చార్జీల విషయంలో ప్రభుత్వం నిర్ణయించిన మేరకే వసూలు చేయాలని, అంతకంటే ఎక్కువ వసూలు చేస్తే బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. గాజువాక మండలం పినమడక సచివాలయంలో ఇసుక బుకింగ్ చేస్తారన్నారు. అక్కడ నుంచి స్లిప్ తీసుకొని వెళ్తే అగనంపూడి డిపో వద్ద నిర్ణీత సమయంలోగా ఇసుక అందిస్తారన్నారు. బుకింగ్ సమయంలోనే స్లాట్ చెబుతారని, ఆ సమయానికి వెళ్తే సరిపోతుందన్నారు. జిల్లాలో పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని శ్రీకాకుళం నుంచి అదనపు ఇసుకను తెప్పిస్తామని చెప్పారు. సెప్టెంబర్ 11 నుంచి నూతన పాలసీ విధానం అమల్లోకి వస్తుందన్నారు. ఇసుక విషయంలో సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబర్ 1800 599 4599కు లేదా dmgvja@gmail. comకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రతిరోజూ జరిగే ఇసుక బుకింగ్, లోడింగ్ స్థితిగతులపై పర్యవేక్షణ ఉంటుందన్నారు.

కాంబోడియా వెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తి అరెస్ట్


రిషిరాజ్

విశాఖ సిటీ: కాంబోడియాలో చైనా ముఠా గ్యాంగ్ చేతిలో చిక్కుకుని, సురక్షితంగా విశాఖకు తీసుకువచ్చిన వారిలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన యువకుడు తిరిగి సైబర్ నేరాలు చేయడానికి కాంబోడియా వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అరెస్టు చేశారు. విదేశాల్లో డేటా ఎంట్రీ ఉద్యోగం పేరిట కొందరు నిరుద్యోగులను కాంబోడియాకు తీసుకెళ్లి, బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తున్న విషయం తెలిసిందే. ఇలాంటి బాధితులను విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు విడిపించి, సురక్షితంగా తీసుకొచ్చారు. వీరిలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన అరుగుల రిషిరాజ్(20) తిరిగి సైబర్ నేరాలతో డబ్బు సంపాదించేందుకు కాంబోడియా వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. నేరుగా వెళితే పోలీసులు గుర్తించే అవకాశం ఉందని వియత్నాంకు హాలిడే కోసం వెళ్తున్నట్లు విజిటింగ్ వీసాపై ఈ నెల 12న ఢిల్లీకి వెళ్లాడు. 15న ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఇమిగ్రేషన్‌కు వెళ్లగా విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు జారీ చేసిన లుక్అవుట్ సర్క్యులర్‌ని గుర్తించి నిలువరించారు. విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందించారు. ఇక్కడ నుంచి వెళ్లిన సైబర్ క్రైమ్ పోలీసులు రిషిరాజ్‌ను అరెస్టు చేసి విశాఖకు తీసుకొచ్చారు.

ప్రకటన

మా క్లయింట్లు అయిన శ్రీ గ్రంధి రాంజీ మరియు ఇతని భార్య గ్రంధి అనుపమ, డోర్.నెం. D.No. 2-22/211/ TL-09, Tulip Villa, Panorama Hills, Yendada, Visakhapatnam, వారిరువురూ ఇచ్చిన భోగట్టాపై తెలియజేయునది ఏమనగా!

మా క్లయింట్లుకి శ్రీ గోరంట్ల కృష్ణప్రసాద్ గారి భార్య శ్రీమతి గోరంట్ల రజనీకుమారి, చినవాల్తేరు, విశాఖపట్నం వారి పేరున గల విశాఖపట్నం జిల్లా, గాజువాక సబురి, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ లిమిట్స్‌లో చేరిన పెదగంట్యాడ మండలం, పెదగంట్యాడ గ్రామం తాలూకా సర్వే నెం. 202/5 రులో భాగమైనట్టి య 1.00సెంట్లు లేక 0.405 హెక్టార్లు విస్తీర్ణం గల జిరాయితీ మెట్టు భూమినకు చెందిన గాజువాక సబురి నందు క్రయదస్తావేజు 3871/2005 నెంబరుగా రిజిస్టర్ కాబడిన తదుపరి 11-7-2007న నా క్లయింట్లుకు రెండు భాగాలుగా విడివిడిగా విక్రయించినారు.

ఈ ఒరిజినల్ దస్తావేజు నెం. 3871/2005 నా క్లయింట్లు ఎండాడ, విశాఖపట్నం వారి ఇంటి నుండి పెదగంట్యాడలో గల వారి ఆఫీసుకి ప్రయాణము చేయుచుండగా తేది. 17-08-2024న పోయినది. దీనపైన వారు 22-08-2024న ఫిర్యాదు కూడా ఇచ్చియున్నారు. కావున ఎవరికైనను సదరు ఒరిజినల్ క్రయదస్తావేజు దొరికిన యెడల ఈ క్రింది తెలిపిన చిరునామాకు లేదా మా క్లయింట్లుకు అందజేయవలసినదిగా కోరడమైనది.

P.SUBBA REDDY
B.Ch. Rajesh Thadi & N.Pushpasree
Advocates
D.No. 4-43-17, Flat No. 504, Venkatagiri Villa, Gandhi Centre, Pedda Waltair, Visakhapatnam.
Ph: 73862 39666

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఆళ్ళగడ్డ ప్రధాన శాఖ -0784, టిబి రోడ్, ఆళ్ళగడ్డ, నంద్యాల జిల్లా

డిమాండ్ నోటీసు

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని రూల్ (3)తో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 లోని సెక్షన్ 13(2) క్రింద)

మీ అభ్యర్థన మేరకు, దిగువ తెలిపిన వ్యక్తి(వ్యక్తులు)కు బ్యాంక్ పేరున సెక్యూరిటీ ఇంటరెస్ట్ కల్పించడం ద్వారా వివిధ ఆస్తులపైన రుణ సహాయం రూపంలో కాలనుగతంగా వివిధ రుణ సదుపాయాలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాచే మంజూరు చేయబడినవి. బ్యాంక్ పేరున సెక్యూరిటీ ఇంటరెస్ట్ కల్పిస్తూ టైటిల్ డీడ్స్ డిపాజిట్ చేయడం ద్వారా మీచే తనఖాపెట్టబడిన ఆస్తి (ఆస్తులు) వివరాలు దిగువ తెలియజేయబడినవి. బ్యాంక్‌కు బకాయి ఉన్న రుణ మొత్తం తిరిగి చెల్లించుటలో రుణగ్రహీత విఫలమైనందున, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాచే జారీ చేయబడిన మార్గదర్శక సూత్రాల ప్రకారం మీ ఖాతాలు **31.03.2024న నిరర్థక ఆస్తులుగా** వర్గీకరించబడినవి. బ్యాంక్‌కు బకాయి ఉన్న రుణ మొత్తం తీర్చవలసిందిగా కోరుతూ రిజిస్టర్ పోస్ట్ ద్వారా **31.07.2024 తేదీ గల డిమాండ్ నోటీసు** పంపగా పోస్టల్ డిపార్ట్‌మెంట్‌చే వాపసు చేయబడినది లేదా అక్నాలెడ్జ్‌మెంట్స్ బ్యాంక్‌కు అందనందున, ఈ నోటీసు జారీ చేయబడినది.

అకౌంట్ నం.38906375426-HL

రుణగ్రహీత పేరు మరియు చిరునామాలు: శ్రీమతి సోముల వెంకట సుబ్బలక్ష్మీ భర్త శ్రీ ఎస్.వెంకట ప్రసాద్ రెడ్డి, ఫ్లాట్ నం. 104, గ్రీన్ సిటీ హైట్స్, తుంగ్లం గ్రామం, గాజువాక మండలం, విశాఖపట్నం -530012. **మరియు: శ్రీమతి సోముల వెంకట సుబ్బలక్ష్మీ భర్త శ్రీ ఎస్.వెంకట ప్రసాద్ రెడ్డి,** ఇం.నం. 5-1-12, పాతూరు వీధి, ఆళ్ళగడ్డ -518543.

బకాయి: 02-05-2024 నాటికి **రూ.45,56,024/- (నలభై ఐదు లక్షల యాభై ఆరు వేల ఇరవైనాలుగు రూపాయలు మాత్రమే).** మీరు అనుషంగిక ఖర్చులు, వ్యయం, చార్జీలు మొ.వాటితో కలిపి పైన పేర్కొన్న మొత్తంపై **02-05-2024** నుండి కాంట్రాక్చువల్ రేటు వంతున భవిష్యత్ వడ్డీ కూడా చెల్లించాల్సి ఉన్నారు.

తనఖాపెట్టిన ఆస్తి వివరణ: గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, SRO-గాజువాక, విశాఖపట్నం పరిధులలోని గాజువాక మండలం, తుంగ్లం గ్రామంలోని సర్వే నం.లు: 2/1 to 2/19, 3/1 to 3/18, 4/1 to 4/14, 5/2B, 5/3B2, 5/4B, 5/5B, 5/6B, 5/7D, 5/8, 5/9B, 5/10C2, 5/11B2, 7/1 to 7/12 ద్వారా కవర్‌చేయబడిన గ్రీన్ సిటీ ప్రాజెక్ట్‌లోని ఫ్లాట్ నం.152లో 5235 చ.గజాల అవిభాజ్య మరియు అనిర్దేశిత భూమి భాగంలో 70 చ.గజాలు లేదా 58.53 చ.మీటర్ల విస్తీర్ణపు స్థలం మొత్తం. **దిగువ విధంగా సరిహద్దులు చేయబడింది మరియు కొలవబడింది: తూర్పు:** 40 అడుగుల వెడల్పు రోడ్, **దక్షిణం:** గెడ్డ, **పశ్చిమం:** S.No.2లో మిగతా భూమి & ట్యాంక్, **ఉత్తరం:** S.No. 1 ట్యాంక్. కామన్ ఏరియాలతోపాటు మొదటి అంతస్తులో 1710 చ.అడుగులు బిల్టప్ ఏరియా, గ్రీన్ సిటీ హైట్స్, ఫ్లాట్ నం.104తో కలిపి ఉండి, దిగువ విధంగా సరిహద్దులు చేయబడింది: **ఫ్లాట్ సరిహద్దులు: తూర్పు:** ఖాళీ స్థలం, **పశ్చిమం:** 8 అ.వెడల్పు కారిడార్ & మెట్లు, **దక్షిణం:** ఖాళీ స్థలం, **ఉత్తరం:** ఖాళీ స్థలం.

SARFAESI చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద ఈ నోటీసులోని నిబంధనల మేరకు పైన తెలిపిన విధంగా భవిష్యత్ వడ్డీ, అనుషంగిక ఖర్చులు, వ్యయాలతో మీరు బకాయి ఉన్న పైన తెలిపిన మొత్తాన్ని ఈ నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో పైన తెలిపిన వ్యక్తి/ వ్యక్తులైన మీరు విఫలమైతే, SARFAESI చట్టంలోని సెక్షన్ 13(4) మరియు సదరు చట్టంలోని వర్తించే ఇతర నిబంధనల క్రింద వివరించిన అన్ని లేదా ఏవైనా హక్కులను బ్యాంక్ వినియోగించుకుంటుంది. చట్టంలోని ఏవైనా ఇతర నిబంధనల క్రింద తగినవని భావించిన విధంగా అట్టి ఇతర చర్యలు లేదా చట్టపరమైన ప్రొసీడింగ్స్ చేపట్టేందుకు బ్యాంక్ హక్కుకు ప్రతికూలాభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఉంటుంది.

తేది: 22.08.2024, ప్రదేశం: ఆళ్ళగడ్డ
సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

భద్రత.. గాల్లో దీపమే.!

- ఫార్మా కంపెనీల్లో భద్రత డొల్ల
- బ్యాంకు రుణాలు, లైసెన్స్ రెన్యువల్స్ కోసమే సేఫ్టీ ఆడిట్స్
- అరకొర పరిజ్ఞానం ఉన్న కార్మికులే నిపుణులు
- నిబంధనలకు తూట్లు పొడుస్తున్నా పట్టించుకోని యంత్రాంగం


పరిశ్రమల్లో 'చితి'కి పోతున్నారు

సాక్షి, విశాఖపట్నం: పరిశ్రమల్లో భద్రత ప్రశ్నార్థకమైంది. రియాక్టర్లు బాంబుల్లా పేలుతున్నాయి. పైప్‌లైన్లు మృత్యుపాశాలుగా మారుతున్నాయి. విధులకు వెళ్లిన కార్మికులు క్షేమంగా ఇంటికి చేరడం దైవాధీనంగా మారింది. రియాక్టర్ల ఒత్తిడిని సరైన సమయంలో గుర్తించకపోవడం, కెమికల్ రియాక్షన్‌ను నివారించడంలో యాజమాన్యాలు విఫలం కావడంతో.. తదనంతరం జరిగే పరిణామాలకు కార్మికులు బలైపోతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ సేవలూ గగనంగా మారాయి. ఇంత ఘోరమైన పరిస్థితులున్నా జిల్లా యంత్రాంగం పట్టనట్టే ఉంది. ప్రమాదకరమైన పరిశ్రమలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి.. లోపాలు సవరించాల్సిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తమ బాధ్యతలను విస్మరిస్తున్నారు.

రియాక్టర్ల తనిఖీలెక్కడ?

ప్రతీ పరిశ్రమను తరచూ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, కార్మిక శాఖ, ఫైర్ సేఫ్టీ అధికారులు పరిశీలించాలి. అప్పుడప్పుడూ ప్రమాదాలు జరిగినప్పుడు తూతూ మంత్రంగా పరిశీలిస్తున్నారే తప్ప.. ప్రమాదాలకు ప్రధాన కారణాలైన రియాక్టర్లను పరిశీలించిన పరిస్థితులు కనిపించడం లేదు. చాలా సందర్భాల్లో కాలం చెల్లిన రియాక్టర్లే పేలిపోతున్నాయని గతంలో ప్రమాదాలు జరిగినప్పుడు వేసిన కమిటీలు హెచ్చరించాయి. ఇది తెలిసీ కూడా అనేక కంపెనీల్లో కాలం చెల్లిన రియాక్టర్లను కొనసాగిస్తున్నట్లు సమాచారం. అయినా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ యంత్రాంగం వీటి జోలికి వెళ్లడం లేదు. వేల లీటర్ల రసాయనాలు ఉండే రియాక్టర్లు పేలుతుంటే.. దానిని అరికట్టేందుకు సరైన వ్యవస్థలు దాదాపుగా ఏ ఫ్యాక్టరీలోనూ కనిపించడం లేదు.

ఉన్న ఊళ్లో ఉపాధి లేక.. పొట్టచేత పట్టుకుని వస్తున్న కార్మికులు పరిశ్రమల్లో చితికిపోతున్నారు. కుటుంబాలను పోషించుకోవడానికి వేరే మార్గం లేక అరకొర సౌకర్యాల మధ్యే బతుకులీడుస్తున్నారు. వారి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వారికి కల్పించాల్సిన సౌకర్యాల పట్ల ఫార్మా యజమానులు నిర్లక్ష్యం వహిస్తుండటంతో కార్మికుల నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

లోపభూయిష్టంగా భద్రతా చర్యలు

ఫార్మా కంపెనీల్లో భద్రతా చర్యలు లోపభూయిష్టంగా ఉన్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పరవాడ ఫార్మా సిటీ, అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా పరిశ్రమల్లో తరచూ జరుగుతున్న ప్రమాదాలు ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి. రసాయన వాయువులు లీక్ కావడం, రసాయన ప్రతి చర్యల సమయంలో ఒత్తిడి పెరిగిపోయి పైపులైన్లు పగిలిపోవడం, రియాక్టర్లు పేలి పోవడం వంటి సంఘటనల్లో పలువురు ఉద్యోగులు, కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. పైప్‌లైన్ లీకేజీ కారణంగానూ పలు పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. వ్యర్థ రసాయనాలు వెళ్లే పైప్‌లైన్ సక్రమంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత కంపెనీ యాజమాన్యాలతో పాటు అధికారులు పర్యవేక్షించాలి. వ్యర్థ రసాయనాలను శుద్ధి చేసే పైప్‌లైన్ ద్వారా బయటకు పంపాల్సి ఉన్నప్పటికీ.. పలు కంపెనీలు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

అంబులెన్స్ సేవలూ గగనమే..

అచ్యుతాపురం సెజ్‌లో 208 పరిశ్రమలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ప్రతి పరిశ్రమకు ప్రత్యేకంగా ఫైర్‌సేఫ్టీ బృందం ఉండాలి. ఓ అంబులెన్స్, ఫైర్ ఇంజిన్ తప్పనిసరి. ఫైరింజన్ లేకపోతే మంటలు ఆర్పే అత్యాధునిక వ్యవస్థలు ఉండాలని ప్రభుత్వ నిబంధనలు చెబుతున్నాయి. అచ్యుతాపురం సెజ్‌లోని కంపెనీల వద్ద మాత్రమే సొంత ఫైర్ ఇంజిన్ ఉంది. అంబులెన్స్‌ల సంఖ్యను వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. ఇక పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు ప్రభుత్వం కమిటీ వేయడం, ఆ తర్వాత కమిటీ ప్రభుత్వానికి నివేదిక అందజేయడం జరిగిపోతుంది. కానీ.. ఆ నివేదికలను ఎప్పుడూ బయటపెట్టిన పరిస్థితులు గానీ, ఆ రిపోర్టులకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

నిపుణులున్నారా?

ఇక కంపెనీల్లో రియాక్టర్లు పేలినప్పుడు నియంత్రించే నిపుణులు ఉండాలి. అయితే అధిక శాతం కంపెనీల్లో అరకొర పరిజ్ఞానం ఉన్న వారే ఉండటంతో.. ప్రమాద సమయాల్లో రియాక్టర్లను నియంత్రించడం కష్టంగా మారుతోందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. యాజమన్యాలు సబ్ కాంట్రాక్టర్లకు పరిశ్రమల నిర్వహణ అప్పగిస్తున్నాయి. సబ్ కాంట్రాక్టర్లు నైపుణ్యం లేని కార్మికులను తక్కువ వేతనాలతో నియమించుకుని ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇక భద్రత గురించి ప్రశ్నించే కార్మికులను యాజమాన్యాలు నిర్దాక్షిణ్యంగా విధుల నుంచి తొలగిస్తున్నాయి. దీంతో కార్మికులు భయంతో ఉద్యోగాలు చేయాల్సిన దుస్థితి దాపురించింది.

అవసరాల కోసమే ఆడిట్లు

ఐఎస్‌వో 14489 (1998) ప్రకారం ప్రతీ పరిశ్రమ సేఫ్టీ ఆడిట్ నిర్వహించి.. ఆ నివేదికను డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌కు సమర్పించాలి. ఈ ఆడిట్‌ను ఏటా ప్రతీ పరిశ్రమ చేయించుకోవాలి. ఫైర్ సేఫ్టీ, కార్మికుల భద్రత, పర్యావరణ కాలుష్యంతోపాటు పైపులు, రియాక్టర్లు, ట్యాంకర్లు, ఇతర పనిముట్ల జీవిత కాలం, ప్రస్తుతం అవి ఎలాంటి స్థితిలో ఉన్నాయి? అనే అంశాలను ఆడిట్‌లో భాగంగా చెక్ చేయాలి. కానీ చాలా కంపెనీలను పరిశీలించకుండానే నివేదికలు సిద్ధమైపోతున్నాయి. నిజానికి ఇండస్ట్రీయల్ యాక్ట్ ప్రకారం చేసే సేఫ్టీ ఆడిట్‌లో ఏ కంపెనీ పాస్ కాదు. ఆ విషయం ప్రభుత్వానికీ తెలుసు. ఫ్యాక్టరీల విస్తరణ, కొత్త ఫ్యాక్టరీల ఏర్పాటు, లైసెన్స్ రెన్యువల్, బ్యాంకు లోన్స్ తదితర అవసరాల కోసమే అన్నట్లుగా ఆడిట్‌లు జరుగుతున్నాయి. నిపుణులైన ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలతో కూడిన కమిటీతో ఆడిట్లు చేయిస్తే.. పరిశ్రమల్లో ఉన్న పరిస్థితి వెలుగులోకి వస్తుందన్నారు.

ఫార్మా మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం

- కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్

మహారాణిపేట: అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని ఎసైన్షియా ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులు, ఉద్యోగుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. కేజీహెచ్ మార్చురీ వద్ద బాధిత కుటుంబాలను గురువారం ఆయన పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రమాదంలో మృతి చెందిన వారి ఒక్కో కుటుంబానికి, వారసులకు రూ.కోటి పరిహారం చెల్లించనున్నట్లు ప్రకటించారు. ఫార్మా సెజ్‌లో జరిగిన ఉదంతం అనుకోని దుర్ఘటన అని ఆవేదన వ్యక్తం చేశారు. అనకాపల్లి, విశాఖ జిల్లాల యంత్రాంగాలు సకాలంలో స్పందించి చాలా మంది ప్రాణాలు కాపాడగలిగాయన్నారు. ప్రమాదంలో మరణించిన వారిలో 12 మృతదేహాలు కేజీహెచ్‌కు వచ్చాయని, పోస్టు మార్టం పూర్తి చేసి మృతదేహాలను సంబంధిత కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు. మొత్తం 41 మంది గాయపడ్డారని చెప్పారు. దుర్ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేస్తామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.118
స్కిన్	: రూ.206
స్కిన్‌లెస్	: రూ.216

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.72,870
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.66,800
వెండి(కిలో):	రూ.92,000

యాజమాన్య నిర్లక్ష్యం వల్లే ఫార్మా ప్రమాదం



కేజీహెచ్ మార్చురీ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ, సీపీఎం నాయకులు

మహారాణిపేట: ఎసైన్షియా ఫార్మా ప్రమాదం యాజమాన్య నిర్లక్ష్యం వల్లే జరిగిందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు ఆరోపించారు. చనిపోయిన వారి కుటుంబాలకు చెరో రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించాలని, యాజమాన్యాన్ని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గురువారం బాధిత కుటుంబాలను కేజీహెచ్ మార్చురీ వద్ద సీఐటీయూ సిఐటియు విశాఖ, అనకాపల్లి జిల్లా కార్యదర్శులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, జి.కోటేశ్వరరావు, సీపీఎం విశాఖ, అనకాపల్లి జిల్లా కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, కె.లోకనాథంతో కలసి పరామర్శించారు. ఈ ప్రమాదాలకు కారణం కేవలం ప్రభుత్వం, యాజమాన్యం నిర్లక్ష్యమేనని ఆరోపించారు. ఈజ్ ఆఫ్ బిజినెస్ పేరిట కంపెనీల్లో సేఫ్టీ ఆడిట్, ఇన్‌స్పెక్షన్ జరగట్లేదన్నారు. బాధిత కుటుంబాలకు రూ.కోటి పరిహారంతో పాటు వాళ్ల పిల్లల చదువులకయ్యే ఖర్చులను యాజమాన్యమే భరించి, కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిటీ యూనియన్‌కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ, వి.వి.శ్రీనివాసరావు, గ్రామిక మహిళా కన్వీనర్ పి.మణి, మున్సిపల్ అధ్యక్షులు టి.నూకరాజు, ముఠా యూనియన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు, చంద్రశేఖర్, జి.అప్పలరాజు, శివ, పి.వెంకటరావు, కుమారమంగళం, నాయుడు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న ఫార్మా ప్రమాద క్షతగాత్రులు

మెడికవర్ ఆస్పత్రిలో
- కె.రాంబాబు, రాంబిల్లి
- బి.శివ వెంకటరత్నం, రాంబిల్లి
- వై.మహేష్‌బాబు, మున్నివడ
- పి.జగదీశ్వరరావు, నక్కపల్లి
- కె.చంద్రశేఖర్, బొబ్బిలి
- పి.దేముడు, బోయపాలెం
- కె.నారాయణరావు , శ్రీకాకుళం

కిమ్స్ ఐకాన్
- డి.శ్రీనివాస్ వర్మ
- బి.ఎస్.వరప్రసాద్‌రాజు
- పి.అరుణ్‌కుమార్

పవన్ సాయి ఆస్పత్రి, కూర్మన్నపాలెం
- జి.సంతోష్, విజయనగరం
- జి.సాయికుమార్, ఎస్.కోట
- జె.ప్రకాశ్, వేపాడ

ఆర్కే ఆస్పత్రి, గాజువాక
- జి.చైతన్య

ఉషా ప్రైమ్ ఆస్పత్రి, అనకాపల్లి
- జె.వర్ధన్, జంగాలపాలెం, ఎస్ఈజెడ్ కాలనీ
- జి.రాజారావు, వెంకటాపురం, రాంబిల్లి మండలం
- బి.సూరిబాబు, వై.లోవ, రాంబిల్లి మండలం
- ఎం.కిరణ్ సత్యనారాయణ, శ్రీనగర్, గాజువాక
- డి.అప్పారావు, యలమంచిలి
- ప్రభాత్‌యాదవ్, హన్మకొండ, వరంగల్
- బంగారు చందకనాయుడు విజయనగరం
- ఎస్.యామిని, ఉమ్మలాడ, మునగపాక మండలం
- ఎస్.వంశీ, హరిపాలెం, మునగపాక మండలం.
- కె.షణ్ముఖరావు రణస్థలం, శ్రీకాకుళం
- బి.ధనుంజయ్, ఒడిశా
- సిహెచ్.అప్పారావు పంచదార్ల, యలమంచిలి మండలం
- ఆర్.సత్యనారాయణ, ధారపాలెం
- కె.షణ్ముఖరాజు దేశపాత్రునిపాలెం, పరవాడ మండలం
- ఎ.పరమేశ్వరరావు, యలమంచిలి
- బి.రామ్ మహిరాబాబు, సోమలింగపాలెం, యలమంచిలి మండలం
- ఎన్.అప్పారావు, లెవి కాలనీ
- నోట్ల పైడి కల్యాణ్, వాశెట్టిపాలెం, ఎస్ఈజెడ్ కాలనీ

'అదానీ'కి కొమ్ముకాయడం దారుణం


నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీ డబుల్ రోడ్డులోని సీబీఐ ప్రాంతీయ కార్యాలయం ఎదుట గురువారం కాంగ్రెస్ నేతలు నిరసన తెలిపారు. హిడెన్ బర్గ్ నివేదిక ఆధారంగా అదానీ కంపెనీ కుంభకోణంపై చర్యలు తీసుకోవడంలో బీజేపీ ప్రభుత్వంతో పాటు సెబీ వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రులు జేడీ శీలం, కిల్లి కృపారాణి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తోడదాసి సుధాకర్, నగర అధ్యక్షుడు వజ్రపత్తి శ్రీనివాస్ మాట్లాడారు. అదానీ సంస్థ లక్షల కోట్లు ప్రజాధనాన్ని లూటీ చేస్తుంటే.. చర్యలు తీసుకోవడం మాని ఆ సంస్థకు కొమ్ముకాయడం దారుణమన్నారు. ఈడీ, సీబీఐ, సెబీ వంటి సంస్థలు బీజేపీ ప్రభుత్వం చేతుల్లో కీలుబొమ్మలుగా మారాయన్నారు. ఇప్పటికైనా అదానీ సంస్థపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మధ్య తరగతి యువకుడి కథే 'సీతారాం సిత్రాలు'


విలేకరుల సమావేశంలో పాల్గొన్న చిత్ర యూనిట్

బీచ్‌రోడ్డు: మధ్య తరగతి యువకుడి కథే 'సీతారాం సిత్రాలు'అని ఆ సినిమా హీరో లక్షణ్ అన్నారు. ఆ సినిమా బృందం గురువారం నగరంలో సందడి చేసింది. ఈ సందర్భంగా మీడియాతో హీరో మాట్లాడుతూ చిత్ర ట్రైలర్, టీజర్‌కి మంచి స్పందన వచ్చిందన్నారు. మధ్య తరగతి యువకుడు పట్నం వచ్చిన తర్వాత జరిగే పరిణామాలే ఈ సినిమా అని, ఇందులో హీరోయిన్ భ్రమరాంబిక టీచర్ పాత్రలో నటించారన్నారు. దర్శకుడు నాగ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ రుద్ర కిరణ్ వీనులవిందుగా సంగీతం అందించారన్నారు. కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా అని, విజయవంతం చేయాలని ప్రేక్షకులను కోరారు. నటుడు సందీప్, నిర్మాత పవన్ రాజ్ పాల్గొన్నారు.

ఈవెంట్ రంగాన్ని పరిశ్రమగా గుర్తించండి

- మంత్రికి వినతి


మంత్రికి జ్ఞాపిక అందిస్తున్న సభ్యులు

బీచ్‌రోడ్డు: ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగాన్ని పరిశ్రమగా గుర్తించాలని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ ఈవెంట్ ఇండస్ట్రీ(ఏపీసిఈఐ), ఈవెంట్ మేనేజర్ల అసోసియేషన్ (ఈమా) సంయుక్తంగా కోరాయి. బీచ్‌రోడ్డులోని నోవాటెల్ హోటల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రిని గురువారం రెండు సంఘాల ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో సుమారు 500 మంది పైబడి ఈవెంట్ మేనేజర్లు ఉన్నారని, ఏటా కోట్లాది రూపాయల బిజినెస్ చేస్తున్నారన్నారు. ఆదాయాన్ని తీసుకువచ్చే ఈ రంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహించడం లేదని వివరించారు. విశాఖపట్నంలో హైదరాబాద్ తరహాలో కన్వెన్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. బీచ్‌రోడ్‌లో ఈవెంట్లు చేసుకునేందుకు జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, పోలీసులు త్వరితగతిన అనుమతులిచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. ఏపీసీఈఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రవిశంకర్, దాడి రవికుమార్, కోశాధికారి శ్రీకాంత్, సీనియర్ ఈవెంట్ మేనేజర్ అజయ్ అగర్వాల్, ఈమా విశాఖ అధ్యక్ష, కార్యదర్శులు సందీప్ కుమార్, షరీఫ్ ఖాన్, ధరణి రాజు, కిట్టు, బీబీ భాస్కర్ ఉన్నారు

డిఫరెంట్ మూవీ డిమోంటీ కాలనీ-2

మద్దిలపాలెం: డిఫరెంట్ కంటెంట్‌తో వస్తున్న డిమోంటీ కాలనీ-2 అందరినీ ఆకట్టుకుంటుందని చిత్ర హీరోయిన్ ప్రియా భవానీశంకర్ అన్నారు. ప్రమోషన్‌లో భాగంగా గురువారం సీఎంఆర్ సెంట్రల్‌లో ఆ చిత్ర యూనిట్ సందడి చేసింది. హీరోయిన్ మాట్లాడుతూ డిమోంటీ కాలనీ-2 థ్రిల్లింగ్ మూవీగా నిలిచిపోతుందన్నారు. దర్శకుడు అజయ్ జ్ఞానముత్తు, నిర్మాత బి.సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ చిత్రం క్షణక్షణం.. ఉత్కంఠ భరితంగా ఉంటుందన్నారు. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందన్నారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడిన అనంతరం లుక్స్ రాజశేఖర్ బృందం డ్యాన్స్‌లతో అలరించింది.

దొరికిన బంగారు హారం అప్పగింత

- నిజాయితీ చాటుకున్న శ్రీనివాస పట్నాయక్


బాధితురాలు దివ్యకు బంగారం హారం అప్పగిస్తున్న ఏసీపీ క్రైం వెంకటరావు

సీతమ్మధార: రోడ్డుపై దొరికిన బంగారు హారాన్ని బాధితురాలికి అందజేసి ఓ వ్యక్తి నిజాయితీ చాటుకున్నాడు. నాలుగో పట్టణ క్రైం పోలీసులు తెలిపిన వివరాలివీ.. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వెలమ భవనం సమీపంలో వాసుపల్లి దివ్య నివసిస్తున్నారు. ఈ నెల 16న రాత్రి 7 గంటల సమయంలో ఆలయానికి వెళ్లారు. అక్కడ పూజలనంతరం ఇంటికి చేరుకున్న ఆమె.. మెడలో వేసుకున్న మూడు తులాల బంగారు హారం పోయిందని గుర్తించారు. వెంటనే నాలుగో పట్టణ క్రైం పోలీసులను కలిసి మార్గమధ్యలో తన హారం పోయిందని ఫిర్యాదు చేశారు. కాగా.. బాలయ్యశాస్త్రి లేఅవుట్ వెలమ భవనం సమీపంలోని కృష్ణ అపార్టుమెంట్‌లో మ్యారేజీ బ్యూరో ప్రతినిధి బాసురి శ్రీనివాస పట్నాయక్ నివాసం ఉంటున్నారు. అదే రోజు రాత్రి 7.30 సమయంలో ఆయన తన కుమార్తెను తీసుకురావడానికి వెళుతుండగా మార్గమధ్యలో ఈ హారం దొరికింది. దానిని ఇంటికి తీసుకెళ్లిన ఆయన.. వివాహ సంబంధాల పని మీద శ్రీకాకుళం జిల్లా పాతపట్నం వెళ్లారు. తర్వాత వచ్చిన ఆయన యోగా టీచర్ సునీతకు ఈ విషయం చెప్పారు. మరో వైపు పోలీసులు దర్యాప్తు చేపట్టినప్పటికీ.. ఆ మార్గంలో సీసీ కెమెరాలు లేక ఎటువంటి సమాచారం లభ్యం కాలేదు. కాగా.. పట్నాయక్ తనకు తెలిసిన పోలీసుకు ఈ విషయం తెలియజేయగా.. ఆయన నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌కు ఈ సమాచారం చేరవేశారు. ఈ నేపథ్యంలో గురువారం సీపీ కార్యాలయంలో క్రైం ఏసీపీ వెంకటరావు సమక్షంలో బాధితురాలికి హారం అందజేశారు. ఈ సందర్భంగా పట్నాయక్‌తో పాటు పోలీసులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. క్రైం ఎస్ఐ సునీల్, ఏఎస్ఐ రామకృష్ణ, కానిస్టేబుల్ దిలీప్, జగదీష్ పాల్గొన్నారు.

జనజీవన గీతం జానపదం


మాట్లాడుతున్న బ్రహ్మానందం


జానపద ప్రదర్శనలు

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలో అన్ని రంగాల మాదిరిగానే.. కళా రంగాన్ని కూడా పరిరక్షిస్తామని, కళాకారులను ఆదుకుంటామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురజాడ కళాక్షేత్రంలో గురువారం ఉత్తరాంధ్ర జానపద జాతర జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి కళాకారుడికి పింఛన్ అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పద్య నాటకాలకు పూర్వ వైభవం తీసుకొస్తామని.. తెలుగు మాండలికాలను కాపాడతామన్నారు. ఉత్తరాంధ్ర కళాకారుడు వంగపండు పాట అద్భుతమని కొనియాడారు. రాష్ట్ర హోం మంత్రి అనిత మాట్లాడుతూ జానపద కళారూపాలను కాపాడుకోవాలని, ఇటువంటి కార్యక్రమాలను ఏర్పాటు చేసి.. కళలను బతికిస్తున్న నిర్వాహకులను అభినందించారు.

కళలకు పెట్టింది పేరు ఉత్తరాంధ్ర

కళలకు, కళాకారులకు ఉత్తరాంధ్ర పెట్టింది పేరని ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం అన్నారు. సృష్టిలో నుంచి పుట్టిందే పాట అని, అక్షరాలను మాటలు, పాటలుగా పేర్చేదే జానపదం అన్నారు. కళాకారుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులను ఘనంగా సన్మానించారు. జానపద నృత్యాలు, పాటల ప్రదర్శన అద్భుతంగా సాగింది. పులి వేషాలు, తప్పెటగుళ్లు, డప్పు ప్రదర్శన, జానపద నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో లోక్ నాయక్ ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, దాడి వీరభద్రరావు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
Study from home. Online Degree, PG, Diploma, B.Tech, BBA, MBA, MCA etc. Courses admissions going on. Guarantee pass. Eligible for all jobs. Ph: 79972 96796 [V- 120119]

FLAT FOR SALE
లంకెలపాలెం : 2 BHK 22 లక్షలు, Jan 25 గృహప్రవేశం. 935 Sft. వాస్తు, పార్కింగ్, లిఫ్ట్, శాంతి స్కూల్ వెనుక, మంచి ఇన్వెస్ట్మెంట్, రెంట్స్ వస్తాయి. ఫోన్ : 93965 58800, 91107 37860 [V- 6528]

PLOT FOR SALE
VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న, కంచికచర్ల శ్రీగంధం, ఎర్రచందనం మొక్కలతో చ॥గ॥ 1,900/- నుండి 18,500/- ఇళ్ళ ప్లాట్స్, ఫామ్‌హౌస్ ప్లాట్ సెంట్ 1,90,000/- సంప్ర: ✆ 91218 84889 [B-62]

R/E WANTED
ప్రముఖ విద్యా సంస్థకు కొమ్మాది మరియు రాజుల తాళ్ళవలస హైవేకు దగ్గరలో 1.50 (ఎకర యాభై సెంట్ల) స్థలము కలిగి 40,000 Sft. బిల్డింగ్ కట్టి అద్దెకు ఇచ్చుటకు ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరును సంప్ర. ✆ 89191 27061 [V- 786837]

BUSINESS OFFER
ద్వారకాఎంటర్‌ప్రైజెస్‌పేపర్‌ప్లేట్స్ & LED మిషన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [G-2157]

మీరు బైబ్యాక్ అగ్రిమెంట్‌తో లాభదాయకమైన లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ బ్యాగ్ వ్యాపారాన్ని ప్రారంభించండి. (ప్రభుత్వ ఆమోదితము) 83760 01873, 96430 10487, 83760 89771, 011-25920179 [DA-5872]

CHANGE OF NAME
I, Hitherto known as GALLONGI NIRMALA D/o GALLONGI BOJJAIAH, R/o D.no 39-2-11/1, Ayyappanagar, Muralinagar East, Visakhapatnam - 530007, Andhra Pradesh, have changed my name from GALLONGI NIRMALA (old name) to GALLANGI MEGHANA (new name) and shall hereafter be known as GALLANGI MEGHANA

CHANGE OF NAME
I, GONTHINA SREE VIJAYA LAKSHMI KUMARI W/o. GONTHINA VISWANADH, previously called GONTHINA SREE VIJAYALAXMI KUMARI, resident of D.No. 24-108-11/1, Gonthinavanipalem, Gajuwaka, Visakhapatnam - 530 026, Andhra Pradesh, Now changed my name from GONTHINA SREE VIJAYALAXMI KUMARI to GONTHINA SREE VIJAYA LAKSHMI KUMARI. Henceforth I will be called as GONTHINA SREE VIJAYA LAKSHMI KUMARI for all purpose.

GOLD LOANS
లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12484]

T.V. REPAIR
SVS TV రిపేర్స్ : 83677 16961 LED TV, Android TV, A/C, వాషింగ్ మిషన్స్, ఫ్రిజ్, మైక్రోవేవ్, మీ ఇంటి వద్దనే స్పాట్ రిపేర్ చేయబడును. 25 సం॥ Ex, 5 సం॥ వారంటీ కలదు. [V-823825]

Wanted
బైక్ రైడర్స్‌తో సంపాదన పక్కా..! రూ. 2000/- day. మన విశాఖ మరియు పరిసర ప్రాంతాలలో, బెనిఫిట్స్: P/F జాబ్, 0% కమీషన్, 25% కొత్త రేట్ కార్డు, డైలీ/వీక్లీ ఇన్సెంటివ్స్, 5 లక్షల వరకు ఇన్సురెన్స్. ఫోన్: 73962 67109 / 040-48937612. [V- 12507]

YouTube Channel required M/F Exp. Content writers to Webseries & Shorts / reels. Digital media Operator (F) also. 89776 36483. [V- 12524]

PASSPORT MISSING
I, LAGUDU VENKATA NARESH, S/o. Venkata Surya Narayana, Resident at D.No.11-170/A3, Gosala Layout, Adivivaram, Simhachalam Post, Visakhapatnam-530028, Andhra Pradesh. I inform you to the public my Pass port bearing No.U8594737 is missed, I am taking Xerox at Old Gosala to Vepagunta Road, on 22.05.2024 in the interim period. In case anybody found those please return to me. Ph : 99668 64481.

కాస్మటిక్ కాస్మటిక్స్ కంపెనీ నందు బ్యూటీ ప్రొడక్ట్స్ డోర్ టు డోర్ సేల్స్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్ కావలెను. M/F. Age : 18-35, Qlf : 10th+, జీతం : 12,000/- to 25,000/- + పెట్రోల్ + ఇన్సెంటివ్స్. ✆ : 96767 58943 [V- 6539]

హరేకృష్ణ హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం, జీ: 18K. ఫోన్: 9640258899, 9640468899 [H-796269]

ప్రముఖ ఎయిర్ పోర్ట్‌లో పని చేయటానికి కార్గో సూపర్ వైజర్, కంప్యూటర్ ఆపరేటర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, క్యాబ్‌డ్రైవర్స్ అర్జెంటుగా కావలెను. జీతం:28000 నుంచి 34000 రూం+భోజనంఫ్రీ.Ph: 9133671684 [HA-515]

రియల్టీ సమాచారం కొరకు లాగాన్ కండి www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.
మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:

మురళీనగర్, మాధవధార	: 90101 33346
NAD, కంచరపాలెం	: 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	: 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	: 90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ, MVP కోలనీ, మద్దిలపాలెం	: 90101 96663
గాజువాక	: 97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం